# సృష్టించుకున్న స్వర్గం

రచన :
శ్రీ పార్వతీశం

నేను పిల్లలను నిద్రపుచ్చి మేడనుంచి దిగుతుంటే వంటింటి తలుపు చప్పుడయింది. మెట్లమీద సగందారిలో ఆగిపోయాను అటువంకచూస్తూ. మావారు వంటయింటి లోనుంచి హాలువైపుకి వస్తున్నారు. ఆయన "యిదంతా యేమిటి" అంటూ విసుక్కొనటం వినబడింది నాకు. ప్రక్కనవున్న కడ్డీని పట్టుకునిలబడి "పూలమొక్కలండీ పెనరలంకనించి తెప్పించాను." అన్నాను వారితో చెప్పకుండా చేసినపనికి కొంచెం భయపడుతూనే.

"ఎవరితో చెప్పి తెప్పించావు... ?"

నా అభిమానం దెబ్బతినింది. తనతో చెప్పకుండా యింట్లో ఏపని చేయటానికి నాకు అధికారంలేదా? నాకా మాత్రం స్వతంత్రంలేదూ??

నాకు దొడ్డీ తోటా అంటే ఎంతప్రాణమో వారికి పట్టినట్టులేదు. అవి నాకెంత సంతృప్తి నిస్తున్నవో, నేను వాటిలో ఎంత తీయని అనుభూతి పొందగలుగుతున్నానో వారు గుర్తించక పోతే ఎట్లాగు ...? నాగురించి గాని నా పనుల్లోగాని వొక్క విషయంలోనైనా కించిత్తు శ్రద్ధవహించారా! నాకెందుకనో రోజురోజుకీ తీవ్రమైన అసంతృప్తి కలుగుతోంది. కొద్దికొద్దిగా నాముఖం కందగడ్డలా ఎర్రబడుతోంది.

"చెప్పటంలేదూ ... ఏమీలేదూ.... నాకు చెప్పకుండా అసలు ఎందుకు తీసుకున్నట్లు.... వెంటనే ఎక్కడినుంచి తెప్పించావో అక్కడికి పంపించి వెయ్యి ..."

వారి మాటలనటంతోనే నాకు వళ్ళు మండిపోయింది. నావంక చూడకుండానే తలుపు ధభేలుమని వేసి వెళ్ళిపోయారు. ఆ శబ్దంలోని అంతరార్ధం స్పష్టంగా గ్రహించగలిగాను. ఆ తలుపుమూత నా హృదయానికి తలుపువేసినట్లుగా వుంది. వారెప్పుడూ నా విషయంలో తలుపుమూస్తూనే వున్నారు. యింతవరకూ నా ప్రేమే — వారిని యిప్పటికీ ప్రేమిస్తూనే వున్నాను — మూసిన తలుపులను తీసి వుంచింది.

వంటింట్లోకి వారు తిరిగిరాగానే నాలో అణచివుంచబడిన అభిప్రాయాలను వెల్లడిద్దామని నేనుగూడ చకచకా అక్కడికి వెళ్ళాను. అటువంటి స్థితిలో అతనితో ఏమి మాట్లాడినా ఉపయోగం ఉండదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నప్పటికి యిప్పుడు వుండబట్టలేకపోతున్నాను.

"ఏమండీ.... యిప్పుడు వాటిని తిప్పిపంపిస్తే వాళ్ళేమనుకుంటారు?" ఆయన ఆశ్చర్య పడ్డారు. వారిముఖంలో సగభాగం లాంతరు వెలుతురికి మెరిసి పోతోంది.

"ఏమిటీ ... నీ కేదో వెఱ్ఱిపట్టినట్టుందే . పదో పరకో కావాలిగదా వీటికి .... ఎక్కడనుంచి పట్టుకు రమ్మంటావు యిప్పుడు" వారివంక వకసారి తీక్షణంగాచూచాను. వీరినేనా అయిదు సంవత్సరాల నుంచి ఎంతో ఆప్యాయంగా చూస్తున్నది? ప్రేమ పరస్పరంచూపగలిగినప్పుడే సార్థక్యం పొందుతుంది. ఎప్పుడూ ప్రేమ రసం ఒక పక్కనుంచే ప్రవహిస్తే దానికి అర్ధం ఏమిటి? నాలో ఆలోచనలు చెలరేగాయి. ఎన్నెన్నో మాట్లాడాలనుకున్నా గాని నా నోటనుంచి వక్కమాటయినా పెగిలి రాలేక పోయింది.

ముడుచుకు పోయిన నాముఖాన్ని చూచి "యిదిగో చూడు.... యింత చిన్న విషయానికిగూడా అలాగయి పోతే .. " వారిగొంతు సముదాయింపును ధ్వనిస్తోంది. వారిలోదయ మూర్తీభవించి వుంది. క్రూరత్వం ఏకోశాన లేదు.

"ఎందుకంత చిన్న విషయానికి ఇంత గలభా ... నీ తోటకి కావలసినన్ని మొక్కలు తెప్పించుకో ...ఏమంత భాగ్యం'' ...కాని అతనిమాటల్లో సంతృప్తిని పొందలేక పోయాను. అవి హృదయంలో నుంచి వచ్చినవికావు."

"నాతోటంటే నాప్రాణం ...నన్ను నేను మరచిపోగలిగింది ఆతోటలోనే ... అదే నాజీవం .... అదొక్కచోటే నా సొంతం నాది అని చెప్పుకోగలిగింది" .... అన్నాను పెద్ద ఉన్మాదినిలాగా వారు నాభాష నర్థంచేసికోలేదన్నట్లు కళ్ళు సూచిస్తున్నాయి.

"మీరు సిగ్గరెట్ల కింద సినిమాలకింద వందల రూపాయలు తగలేస్తుంటే .... నేనూ అంతడబ్బు పెట్టి తోట బాగు చేసుకుంటాను.... ఆమాత్రపు హక్కు నాకా

వుంది." నామాటలు యీసారి కొంచెం దురుసుగానే వచ్చాయి.

"దానికీ దీనికీ సంబంధమేముంది...." నేనూహించిన మాటలే వారినోటినుండి వెలువడ్డాయి "అదినాకో సరదా, మేం మొగవాళ్ళం.... నాయిష్టం...." ఆయన మొగవాడ యితే నే నాడదాన్ని గాదూ ...నాలో రక్త మాంసాలు లేవూ....

ఆయనక్కడనుంచి మెల్లిగా గదిలోకిపోయి కుర్చీలో జేరగిలబడి రేడియో పెట్టారు. నాకు తెలుసు వారు కుర్చీలో ఏ రకంగాకూర్చునేది. ముఖంలో ఏరసం వలక బోసేదీ ...అనుకున్నట్లుగానే జరిగింది.

వక్కసారి బరువుగా నిట్టూర్పు వదిలాను వారి వంక చూస్తూ. అన్నం తిన్న కంచాలన్నా తీయనేలేదు. వీటన్ని టినీ చూచి ఆయనేమనుకుంటారు "శారదలో శ్రద్ధ సన్న గిల్లుతోంది....యిప్పుడు వక్కపనీ శ్రద్ధగా చెయ్యటం లేదు....ఏమో యికముందు ముందు ఎట్లా వుంటుందో" నాగురించే నే నాలోచనలో పడ్డాను. నే నంటే ఫలానా భద్రంగారి భార్యనని— ఎవరో వక మనిషి పెళ్లాం.... అంతేగాని ప్రత్యేకమైన భావాలు, అభిరుచులు వున్న వక స్త్రీ మూర్తిని గాదూ!!!

కాపురానికి వచ్చిన కొత్తలో ఎంతగా ప్రేమించారు. వారి కౌగిలిలో నలిగిపోయిన మధుర దినాలు మనసులో మెదులు తున్నాయి. ముఖ్యంగా నల్లగా నిగ నిగలాడే నా జుట్టును చూసి ఎంతగా మురిసి పోయేవారు. వారి నుంచి సరిగా కోరుకునే దేమిటో నాకే అర్థంకావటంలేదు. జరిగి పోయిన దృశ్యాలన్నీ కళ్ళ ఎదుట నృత్యం చేస్తున్నాయి. జీతంరాగానే ఇంటి అద్దెకని, పాలబాకీకని, పెరుగు ఖాతా కని డబ్బు యిచ్చేవారు. వీటన్నిటికీ యిచ్చిన వారు నా సొంత ఖర్చుకోసమని కొంతపైకం ఎందుకనియివ్వరు?

"శారదా ... నీకెంత డబ్బుకావాలో చెప్పు" అని ఆడుగుతారేమో నని ప్రతి నెలా ఎదురు చూసేదాన్ని. వక్కనెల గూడా ఆవిధంగా జరగలేదు.

"మరి నా సొంతం కోసం.... ఏమీ యివ్వరేమండీ?" అడిగాను నేను వకనాడు ధైర్యంచేసి. వకచీరే కొను క్కోవలసి వస్తుంది ...వక రెవికల గుడ్డ తీసుకుంటాను అనుకోండి ఎట్లాగుమరి?" నా గొంతు కొంచెం తగ్గిం చాను ఆవేశం కనపడనిచ్చే ఉద్దేశం లేక పోవటం మూలాన.

"నీకు ఫలానా వస్తువు కావాలని ఉంటే నాతో చెప్ప రాదూ—మనం కొనగలిగిన దయితే కొనేద్దాం ....మన తాహతు తెలియదా నీకు మరీను ...." వారు వక చేత్తో రేగినజుట్టు సరిచేసుకుంటూ రెండో చేత్తో నన్ను తన హృదయానికి హత్తుకుంటూ అన్నారు.... "మాశారద మట్టుకు యింకో స్త్రీ కంటే ఏంతక్కువ తింది .... చీరె కావాలంటే చీరె ...రెవిక కావాలంటే రెవిక కొనుక్కుం టుంది ..." అన్నారు. అతని సముదాయింపు వట్టిమాట లతోటి పోయేదని అర్థం చేసికోగలిగాను అయిదేళ్ళ సం సారంలోనూ....

మాశారద....మా .... శార... ద ఈ మాటలు నేను అయిదు సంవత్సరాల నుంచీ వింటూనే వున్నాను. యిం టిలో నాస్థానం అతని పిల్లలకి నేను తల్లిగా వుండటమే అంతే నాకున్నహోదా. పిల్లల విషయంలో జోక్యంకలుగ జేసు కోవటానికి గూడా నాకెటువంటి అధికారమూ లేదు వాళ్ళందరికీ వట్టిబండ చాకిరీ చేయటంతప్ప.

వకరోజు నారింజ రసం తాగనని పట్టుపట్టాడు మా ఆఖరి అబ్బాయి రాము. బలవంతం చేస్తే చెంచా గిరవాటు వేసి గోడదగ్గరకుపోయిఏడుపు మొదలెట్టాడు. పేపరుమీద నుంచి చూశారు అయన. రాము వైపు చూస్తూ "తాగు రామూ ... మా బాబుగదూ .... మా రాము మంచి అబ్బాయి '' అన్నారు. గది కిటికిలో నుంచి వచ్చిన సూర్యకాంతి గది నేలంతా పరుచుకు పోయింది. గది గోడలమీదికి గూడా కొద్దిగా ఎగబాకింది రాము కళ్ళలో నీళ్ళు మెరుస్తున్నాయి ఆ సూర్యకాంతికి. నేను స్పష్టంగా చూడగలిగాను.

"డాక్టరు చెప్పాడుగదా మరి .... తాగనంటే బలవం తాన యివ్వవద్దని ..'' నా మాటకీ ఎదురు చెప్పటమే ఆయనకు కావలసింది.

"నాన్సెన్సు ... నేనెట్లా పెరిగాను నా పుట్టుక నుంచీ పెద్దవాళ్ళ భయభక్తుల్లో .... వాళ్ళెలా చెపితే అలా వినే వాడిని ... నా బిడ్డలయినా అంతే నేను చెప్పినట్లు వినా లిసిందే ఈ తాగరామరి. మరీమరీ మారాం ఎక్కువవు తోంది" గదమాయించారు గుడ్లురుముతూ. యింతలోకి

యింత ఆగ్రహం ఎక్కడనుంచి వచ్చిందో మరి. నాకు వుక్రోషం వచ్చింది.

"నేను తాగనక్కర్లేదని చెపుతున్నానుగా మరి."

"నేను తాగాలని చెపుతున్నాగామరి. ఒరేయి తాగరా" నేను మెల్లిగా లేచి నిలబడ్డాను. నన్ను వట్టి పెళ్ళాంగానే అన్ని విషయాల్లోనూ చూడటం నాకు చాలా కష్టం కలిగించింది. ఎంతకాలం నుంచో వేధిస్తున్న వ్యధ ఈనాడు బట్టబయలవు తోంది.

ఆయన రేడియో వంక తదేక దీక్షతోచూస్తూ "దేవుడికో నమస్కారం పెటతానుగాని ఏమీలేని దాని కింత హంగామాచేస్తా వెందుకు క్రికెటుస్కోరువినాలియివ్వాళ" వారియీమాట నాఉద్రిక్తతను ఏమాత్రం సడలింప లేకపోయింది. యింకా కొంచెం రగుల్కొలిపిందిగూడాను. నేనేమన్నానో సరిగ్గానాకుగూడా తెలియకపోయినా. హృదయ వేదన భరించక బయటకు అనేశాను "యిదిగోనండీ మిలో ఏదయినామార్పు వచ్చేటట్లయితే సరేసరి లేకపోతే నా పిల్లల్ని వెంటపెట్టుకుని వెళ్ళి పోతాను "అన్నాను. నిర్ఘాంత పోయారాయన. ముఖం వక్కసారిగా నల్లబడి పోయింది. చైతన్యం నశించింది. తరువాత మెల్లిగా నవ్వుతూ అన్నారు "ఏం... శారదా యివ్వాళ వెర్రి ఏమయినా పట్టిందేమిటి... ఆ ..."

"నాకు వెర్రేమీ పట్టలేదు. మీధోరణి మార్చుకోకపోతే అంతే" వారు తెచ్చి పెట్టుకున్ననవ్వు వక్కసారిగా ఆగిపోయింది "నీకు మతి పూర్తిగా పోయినట్టుంది గాని వూరికే వాగకుండా పడుకుంటే తెల్లారేప్పటికి నిర్మలంగా వుంటుంది. నన్నేమైనాబెదరిద్దామనుకుంటున్నావాఏమిటి?" నాలో కోపం చెలరేగింది. నేను కోరుకున్న వ్యక్తిత్వాన్ని యివ్వకుండా నాపూర్వ స్థానంలోనే వుంచేద్దామని ప్రయత్నం చేస్తున్నారు. అసలు ఈపూలనూటే గాదు ఈ గొడవకంతటికీ మూలకారణం. ఈ విషయంలో సమస్యలన్నీ పరాకాష్ట నందుకున్నాయి. ఇప్పుడు తేలవలసింది నా వ్యక్తిత్వ నిర్ధారణే.

"బెదిరించాలిసిన అవసరం నాకేమీలేదు. కాపురానికి వచ్చిననాటినుంచి చూస్తునే వున్నాను ఎవరు బెదరించేదీ. నాలో వణుకు ప్రారంభమయింది. నిలబడలేక పక్కనే వున్న పడక కుర్చీలో కూలబడ్డాను. "యింతకు ముందు ఎన్నిసార్లో చెపుదామని చూచినా మీరువినిపించు కోకుండా తోసి పుచ్చారు" "ఏమిటే నీవుద్దేశ్యం? మనకు పెళ్ళయినప్పటినుంచి యింతేనా మనకు సుఖంలేక ఏమొచ్చింది. మన ప్రేమకి అడ్డంకు లేమున్నాయి. ఈమాత్రం అర్థం చేసి కుంటావను కున్నానుగానీ" అతని గొంతు గీరపోయింది. ముఖం ఎర్రగా కందింది "మనం యిప్పుడు మాట్లాడవలసిందేమీలేదు" లేచినవాడల్లా మళ్ళీ కుర్చీలో కూర్చుని "నేనిప్పుడు రేడియో వినాలి" అన్నారు ముఖం గంభీరంగా పెట్టి ఇంతటితో ఈ గొడవ వదిలి పోయిందనుకున్నారు ఆనాటికి ఈ నాటికీ విపరీతమైన వైరుధ్యం వుంది. నేనిప్పుడు వకనిర్ణయానికి రాగలిగాను. కుర్చీలోనుంచి లేచి రేడియో ఆపేశాను బలవంతాన.

"మీరీరోజున రేడియో కట్టేసి నామాటలు విని అర్థం చేసికోవాలి"

"శారదా? "

"మీరు వక స్త్రీ అంటే ఏమి టనుకుంటున్నారు?" నేనావేశంగా అడిగాను నాలో భాషాపాండిత్యం సమగ్రంగా లేక పోవటం వలన నేననుకున్న భావాలన్నిటినీ సూటిగా వ్యక్తపరచలేక పోయాను. "స్త్రీ గూడా వక మనిషే! ఆమెకీవ్యక్తిత్వం వుంది. మన పెళ్ళి అయిన నాటినుంచి అంతా మీదే ....మీదే.... మీచేతి మీదుగానే పనులన్నీ జరిగిపోతున్నాయి. మీరు చెప్పినట్లు విని పడివుండే పని మనిషి మాదిరిగా అయిపోయాను గాని యింతవరకు ఈ కుంటుంబానికి సమభాగినినిగా, అర్ధాంగిగా వుండనివ్వలేదు వట్టి ముద్దుపెళ్ళాంగా మార్చి వూరుకున్నారు."

"అరి భగవంతుడా ఇదేమన్నా ఉపన్యాసమా ఏమిటి" అన్నారాయన నాముఖంలో రక్తం చిందింది. "అవును" నేను చెప్పదలచుకుంది చెప్పేశాను. మీరు అర్థంచేసి కోవటానికి కనీసం యిప్పుడయినా ప్రయత్నించాలి ..."

"ఇంక ఆపేశెయ్యి ధోరణి" అతని ముఖంలో యింత కోపం నేనివివర కెన్నడూ చూడలేదు. అయినా యిప్పుడు దానికి కొంతకారణం ఉంది.

"అదేమంత వెర్రివాగుడు కాదు ....ధోరణికాదు."

"ఇప్పుడేం తక్కువయింది మనకు? ..."

"నేనదే చెప్ప బోతున్నాను. నా సొంతానికి కొంత డబ్బుండాలి నాదగ్గర పనిచేసే మనిషికయినా కూలిడబ్బు

లిస్తారు, కాని నాకాయోగ్యతగూడా లేకపోయింది. ఈ కొంపలో నేనను కున్నట్లుగా నేను ఖర్చు పెట్టుకుంటాను. ఏం? సిగరెట్లకనీ వాటికనీ మీ యిష్టం వచ్చినట్లు మీరు ఖర్చు పెట్టటంలేదా? మీరునన్ను డబ్బు అడగక్కర్లేదు. మిమల్ని నేనూ అడగక్కర్లేదు." ఆయన ముఖాన్ని శ్రద్ధగా పరిశీలిస్తున్నాను. ఎటువంటి మార్పులేదు. నేను సంతృప్తిగా వకదీర్ఘ నిశ్వాసం వదిలాను. పిల్లల సంగతి నాకు వదిలేశెయ్యండి. వాళ్ళబాగోగులు నేను చూచుకుంటాను. వాళ్ళవూసు మీకేం అక్కరలేదు సరదాకోసం తప్పితే. వాళ్ళు నేను చెప్పినట్లు వినాలి!" ముందర చిన్న విషయాల దగ్గరనుంచి ప్రారంభించాను. గడ్డుసమస్యల వైపుకి మెల్లిగా పోవచ్చునని వకక్షణం ఆగి మంచి మంచి మాటలకోసం వెదకటం ప్రారంభించాను.

"అంతేనా .... యింకేమన్నా ఉందా?"

అతని పురుషత్వంమీద చేస్తున్న దాడికి నేనేమంత సిగ్గు పడలేదు. నాపట్టు విడువకుండా "యింకా చాలావుందండి. మీకు మాదిరిగానే అభిరుచులు అభిమానాలు వున్న వ్యక్తిననే అభిప్రాయాన్ని ముందర మీబుర్రలోకి ఎక్కించండి. మీరునన్ను ప్రేమిస్తున్నారంటే మీ భావాలనే మీరు ఆలోచిస్తున్నారు గాని నావాటిని గురించి ఎన్నడయినా ఆలోచించారా? నేనేదో మీచేతి ఆటవస్తువుగానూ కీలు బొమ్మగానూ వున్నాను మీప్రాణానికి. అదీ అసలువిషయం. ఉన్నసమస్యల్లోకల్లా యిదే గడ్డుసమస్య యిప్పుడు"

అతను స్తబ్దుడయ్యాడు. ఖంగారు పడిపోయాడు...." ఆడదానికీ మగవాడికీ చాలా తేడావుంది" మెల్లిగా గొణిగాడు తగిలిన ఆఘాతాన్ని సర్దుకుంటున్నట్లుగా.

"తేడావున్నదంటున్నారు కదూ ... బహుశా కొన్ని విషయాల్లో అయితే కావచ్చు. కానీ ఆమెకీఆనందంకావాలి. ఆహ్లాదం కావాలి. చీవాట్లూ, అర్థంలేనికౌగలింతలూకాదు. మీరెన్నడూ యింతవరకూ యివ్వనిదీ యివ్వటానికి ఆలోచించనిదీ కావాలి యిప్పుడు"

నా భావాలను నా చేతనయిన భాషలో నా నోటికి తగిలిన మాటల్లో చెప్పేశాను. నేనింతకన్నా చేయగలిందేమీలేదు. నామాటలు అతనికి రుచించలేదు. సహజమే. ఇటువంటి మాటలు ఏమాత్రం మర్యాదగల స్త్రీ అయినా అడుగుతుందా? ఎక్కడన్నావుందా యీ విడ్డూరం!

"అర్థంలేని ఆర్భాటాలు.... వెర్రిగొడవ .... ఈమాటలన్నీ ఎవరయినా వింటే.... నీ మంచి తనం బయట పడుతుంది వక్కసారి. నేనింకా ఏమిటో అనుకుంటున్నాను ఆ...."

నాలోశక్తి క్షీణించిపోయింది. "మీరు నన్ను పూర్తిగా అర్థం చేసికోలేకపోతే—" నా గొంతు గీరపోయింది. ఆశ్చర్యంగానే ఉంటుందిగదూ. ఎరగని వక కొత్తవాణ్ణి పెళ్ళికాగానే ప్రేమించటం. ప్రేమించిన వ్యక్తితో తగాదా పడగానే విడిపోవటం. "మీరు కొంచం అర్థంచేసికోవటానికి ప్రయత్నమయినాచెయ్యండి. నా భావాలకుసరియైన విలువ కట్టండి." అన్నాను.

"యిక్కడ అర్థం చేసికోవటానికి ఏమీ లేదూ. నీ బుర్రలో కొన్ని వెర్రి ఆలోచనలు కలిగాయి. అంతే. నేను మాట్లాడుతున్నదంతా తెలిసే మాట్లాడుతున్నాను" ఆయన లేచి నిలబడి వాకిలి వైపుకి తిరిగారు అటు పోయే వుద్దేశంతో. సంభాషణ అయిపోయింది. అణగారిపోయిన ఆశ కొడిగట్టిన దీపపు వెలుతురులాగా నామీదకు పాకింది.

"నన్నొక జీవంలేని ఛాయను చూసినట్లు చూస్తారా! వక్కసారి బిగ్గరగా ఆవేశంలో అరిచాను. "నా ప్రేమ పాత్రమైన వక్కతోటను గూడా మీ వెర్రి కూర మొక్కలతో పాడుచేద్దామనుకుంటున్నారుగదూ. నాలోని జీవం ఆతోటలోనే వుంది. నా చేతుల్లో పెరిగిన మొక్కలు నవ్వుతూంటే, పుష్పసుగంధాలను విరజిమ్ముతూంటే.... అదేగా నా ప్రాణం. దాన్నిగూడా లాగేద్దామని చూస్తున్నారుగదూ ..."

అతను మాట్లాడలేదు. జవాబుచెప్పే వుద్దేశంగూడా లేనట్టుంది. అసలు నేను చెప్పిన మాటలు విన్నట్టుగూడా లేదు. అతని ఉద్దేశం ఏదో పిచ్చిది వాగుతోందనే. "యింకా ఎందుకు ఈ కొంపలో. నా పిల్లల్ని వెంట బెట్టుకు వెళ్ళిపోతాను" అన్నా. అతను బయలుదేరిన వాడల్లా వెనక్కు తిరిగి నాకు చాలా దగ్గరగా వచ్చాడు. "ఏమిటి శారదా! ఈ ఆవేశమంతా? నా పిల్లలు నా పిల్లలు అంటావు. మనవాళ్ళుగాదూ! ఎక్కడకీ వెళ్ళిపోతానంటావు? ఏమిటీ ఆలోచనల్లన్నీ" సముదాయిస్తున్నట్లుగావుంది అతని ధ్వని. "పోయి పడుకుందాం రా! మరీ యిదయిపోతున్నావు ..." నేను ఒక్కమాటగూడా

మాట్లాడలేదు. ఇదివరకు మాదిరిగానే ఈనాడూ నా ప్రయత్నం పూర్తిగా విఫలమయినట్లే. తెల్లవారగానే వెళ్లిపోతాను. నా మాటలు అర్థం చేసుకోలేని నా భావాలను అవగతం చేసుకోలేని గుడ్డి అధికారాన్ని యిక సహించలేను.... ఆడదాన్నయినా వ్యక్తిత్వంలేని వకడికి వట్టి పెళ్ళాంగా నలిగిపోలేను. అటువంటిదాన్ని సహించలేను.

అయినా అతను నన్ను ప్రేమిస్తున్నట్లు నాకు తెలుసు. కొంచం వింతగానే కనబడినా అతనిమీద నాకెటువంటి ప్రేమా లేదంటే వాళ్ళ మూర్ఖత్వానికి నేను విచారపడవలసిన అవసరమేమీ లేదు.

ఆ రాత్రంతా ఎలా గడిపానో నాకు తెలియదు. వళ్ళంతా అభిమానంతో ఆవిరి తేలుతోంది. తెల్లవారి లేచినప్పటినుంచీ ఆయన పనికి పోయేటంతవరకూ నేను చేసిన ప్రతి చిన్నపనిలోనూ ఏమాత్రం శ్రద్ధ చూపించలేకపోయాను. ఆయనకు అన్నం వడ్డించేటప్పుడు, చెయ్యి కడుక్కోడానికి నీళ్ళు పోసేటప్పుడు ఎంత నిర్లక్ష్యం చూపానో! కాని అతను ఏమీ చీకాకుపడలేదు. బయటకు వెళ్ళిపోయేటప్పుడుగూడా నవ్వుతుంటూ వెళ్ళిపోయాడు. ఆ నవ్వులోని నిర్లక్ష్యభావాన్ని స్పష్టంగా చూడగలిగాను. ఏమిటీ యితని మనస్తత్వం!

అతను రోడ్డు దాటేటంతవరకు కిటికీలోనుంచి చూస్తూనే వున్నాను. అతనిమీద ద్వేషం లేదు నాకు. నా హక్కును, నా ఉనికిని ఆయన గుర్తించాలనేదే నా పట్టుదల. నా ఆలోచనలు పెరుగుతున్నకొద్దీ మరీ అయోమయంగా అవుతోంది నా పరిస్థితి. నిన్నటి తగాదాతో అతని అభిమానం పూర్తిగా దెబ్బతిని ఉండచ్చు. నాకేమైనా అనవసరపు గొడవలు తెచ్చిపెటితే ... నాలోని ఆవేదన పెరుగుతున్నకొద్దీ ఆలోచనలు వికృతరూపం దాలుస్తున్నాయి,

మా అమ్మకు టెలిగ్రాం ఇవ్వగానే సాయంత్రానికల్లా బస్సుమీద వచ్చేసింది నన్నూ పిల్లల్నీ తీసుకుపోవటానికి ముప్పైమైళ్ళ దూరంలో వున్న గడ్డిపాడునుంచి. నాదగ్గర డబ్బుందని నేనేమీ విడమర్చి చెప్పనక్ఖరలేదు. ఆమెకు తెలుసు. పరిస్థితులు విషమించాయనిగూడా ఆమెకు తెలుసు. నేను చెప్పనక్కరలేకుండానే తెలుసుకోగలిగిన మనిషి వచ్చేటప్పటికి నాకు కొంచంధైర్యం కలిగింది.

నా పిల్లలందరికీ అమ్మమ్మ దగ్గిర కాలక్షేపం బాగానే వుంది. ఇపుడు నా పిల్లల్ని నా ఇష్టంవచ్చినట్లు బాగు చేసుకోవచ్చు. నే నేదన్నా చిన్న ఉద్యోగం వకటి చూసుకుందామని మా అమ్మతో చెప్పాను. "కొంచం ఆగు కారదా!" అంది ఆమె. "కొంచెం ఆగు మరీ.... నీవు కొంచెం స్థిమితం తెచ్చుకో ముందర. తరవాత అంతా నీ ఇష్టం వచ్చినట్లు చేసుకొందువుగాని. ఏమవుతుందో చూద్దాం." "చూద్దాం" అనే మాటలో ధ్వనించే అభిప్రాయమేమిటో నాకు తెలుసు. కట్టుకున్న పెళ్ళాన్ని కాలదన్నుతాడా అని ఆమె అనుమానం. అటువంటి అనుమానం నాకూవుంది. కానీ ఏంచేస్తారోమరి? అట్టి ఆలోచన నన్ను బాధించినపుడల్లా ఆమాటను మనస్సులోకి చేర్చనిచ్చేదాన్నికాదు. అటువంటి సమయంవస్తే అపుడే చూడవచ్చు. యిప్పుడేం తొందర?

ఒక విషయం మట్టుకు గట్టిగా నిర్ణయించుకున్నాను. పాత షరతులమీద యింటికి పోకూడదు ఎటువంటి పరిస్థితుల్లోనయినా. కాని అతని పట్టుదల, మొండితనం చూస్తుంటే పరిస్థితులు ఎలా విషమిస్తాయోనని భయం వేసింది

ఒకరి స్వార్థంవల్ల యిద్దరి జీవిత సౌఖ్యం ఏవిధంగా పటాపంచలయ్యేది తలుచుకుంటే ఒక్కొక్కసారి కళ్ళలో నీళ్ళు తిరిగేవి. వాటిని తుడుచుకోవటం సిగ్గుమాలిన పని అనిపిస్తుంది నాకు. నాకున్న సంతృప్తి అల్లా ఒకరకమైన కొత్త అనుభూతి పొందగల్గుతున్నాను. కోరుకున్నప్పుడు నిద్రపోవచ్చు. కావాలనుకున్నప్పుడు నిద్ర లేవవచ్చు, యిష్టమయితే— జరిగిన అయిదు సంవత్సరాలమాదిరిగా కాకుండా— రాత్రంతా యింకొకరి యిష్టంమీద ఆధారపడకుండా నాయిష్టం వచ్చినట్లు గడపవచ్చు.

రోజులు గడిచినకొద్దీ నాలో నిరాశ ఘనీభవించిపోతోంది. చంద్రం వచ్చి, నాఅభిప్రాయాలను అర్థంచేసికొన్నానని చెప్పినా అతనితోపాటు మళ్ళీ మొదటిచోటికి పోగలనని అనిపించటంలేదు. దానికి కారణం అతను ఎన్నటికీ నిజంగా నన్ను అర్థం చేసికోలేడనే గట్టినమ్మకం. కోపమొచ్చి మళ్ళీ రాకుండాపోతే; నా జీవితంలో ఏం సుఖపడబోతున్నాను. నాహృదయాంతరాళంలో యింకా అతనిమీద ప్రేమకు స్థానం వుంది. నేను ఒకనిశ్చయానికి

వద్దామని ఎంత ప్రయత్నం చేసినా నాలోని అంతర్వాణి ఎదురుతిరుగుతూనే వున్నది.

ఒకనాడు హఠాత్తుగా వూడిపడ్డాడాయన. వాకిటి ముందర రిక్షా ఆగటం, అందులోనుంచి ఆయన దిగటం చూచేటప్పటికి నాలో అనేకమైన ఆలోచనలు ఒక్కసారిగా తలలెత్తాయి. గేటు తీసుకుని సూటిగా నాదగ్గరకు వచ్చారాయన. అతని ముఖంమీద పడిన సూర్యకాంతి క్షణక్షణానికి వింత వింత రంగులు దాలుస్తోంది. సంతోషం, భయం, బాధ, కోపం ? యింకా ఎన్నో భావాలు మిశ్రితమవుతున్నాయి. తీవ్రమైన ఘర్షణయేదో రాబోతున్నట్లు నామనస్సు సూచించింది. దానిని ఎదుర్కొటానికి సంసిద్ధంగా నిలబడ్డాను.

ఘర్షణ ఏమీ జరగలేదు. నావంకచూస్తూ పేలవంగా నవ్వటానికి ప్రయత్నించాడు. "శా-ర-దా నీతో కొంచెం మాట్లాడాలి ... నీతోచెప్పాలిసింది చాలావుంది శారదా" "అవును నాకు తెలుసు" అన్నా నేను. నాగుండె వేగం కొంచెం హెచ్చింది. ఈ అయిదుసంవత్సరాల దాంపత్యం లోను యింత కుళ్ళు పెరిగిందన్నమాట! పెట్టని గోడలు ఎంత ఎత్తుగా పెరిగిపోయాయి! రాము పుట్టిననాటినుంచి ఈ మార్పు మరింత స్పష్టంగా కనబడుతోంది.

"మనం యిక్కడే మాట్లాడుకోవచ్చు ... అంతగా కావాలంటే డాబామీదికి పోదాం రండి"

"అదేం కుదరదు. మనం ఒంటరిగా మాట్లాడాలి. అసలే నా నోటికి మంచి మాటలు రావు. మన కొంపకి పోదాం వస్తావా ఈ ఒక్కరోజుకయినా ?"

అతని మాటలు నాకర్ణపుటాల్లోకి లోతుగా చొచ్చుకుపోయినాయి. వాటిలో సానుభూతి వుంది. ఇప్పుడతను బ్రతిమలాడుతున్నాడు. ఆజ్ఞాపించటంలేదు. ఎంత ఖైదు లాగవున్నా ఒక్కరోజు భాగ్యానికి ఆ పాతయింటికి పోవటానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ కనిపించలేదు.

మేమిద్దరం పాత యింట్లో అడుగు పెట్టగానే గడచిన గాథలన్నీ మెదడులో మెల్లి మెల్లిగా మెదలసాగాయి. "లోపల పని మనిషి వుంది నువ్విక్కడ కూర్చో శారదా" అన్నాడతను నేను లోపలికి పోబోతూంటే నివారిస్తూ. కుర్చీలో కూలబడ్డాను ఎక్కడో కొత్తచోటులో కూర్చున్నట్లుగా. లాగు జేబుల్లో చేతులు పెట్టుకుని మండువా స్తంభానికి జేరగిలబడి నిలబడ్డాడు.

"నేనెక్కడ ప్రారంభించాలో నాకు తెలియటంలేదు. శా-ర-దా! నా అంత తెలివి తక్కువ మొద్దు మూర్ఖుడు యింకొకడు లేడనుకుంటాను. నిజంగా శారదా నీవు వ్రాసిన ఉత్తరం చూచేటంతవరకూ నాకెంత వళ్ళు మండిపోయిందో నీకు తెలియదు. "నేను చెప్పానుగదా వెళ్ళిపోతానని. మీ కారోజునే చెప్పాను." "నువ్వు చెప్పిందాంట్లో ఒక్కమాటగూడా నమ్మలేను నేను.... అంతా ఏదో చికాకుమీదట నువ్వన్నమాటలనుకున్నానుగాని.... నీ హృదయంలోంచి వచ్చాయని ... నీవింతబాధ నిజంగా పడుతున్నావనిగాని తెలిసికోలేకపోయాను శా-ర-దా!"

అతని ముఖం ఎర్రగా కందింది. బరువుగా అడుగులు వేసుకుంటూ నా ఎదుట పచార్లు చేయటం మొదలు పెట్టాడు. ఇతను పాత చంద్రంకాదు. అతనివైఖరి అతనిలోని మార్పును సుస్పష్టంగా వ్యక్తపరుస్తోంది.

"ఆరోజున కోపం పట్టలేక మీ అమ్మగారి యింటిదాకా వచ్చాను. భర్తగా ఎంతో బాధ్యత నిర్వహిస్తున్నాననే నా దురహంకారం అడ్డు తగిలింది. తిరిగి వచ్చేశాను." ఆ ఒక్కక్షణం ఆగి మళ్ళీఅందుకున్నాడు. "మనం చిన్నపిల్లలుగా వున్నపుడే మనకీవిషయాలన్నీ ఎందుకు సరిగా చెప్పరు మన పెద్దవాళ్ళు ? ఎప్పుడూ అనుభవించి పశ్చాత్తాపపడి నేర్చుకోవలసిందేనా ? ఇటువంటి జీవితంలోని ముఖ్యవిషయాలన్నీ ... ధూ ..." అతని ముఖంలో కోపం, పశ్చాత్తాపం కనబడుతున్నాయి. నేను బిత్తరపోయి చూస్తున్నాను.

"ఆడవాళ్ళు గూడా మనుష్యులేనని, మా మాదిరి మనుష్యులేనని ఎందుకు చెప్పరు మాకు ? ఇప్పుడూ అంతే అజ్ఞానంలోనూ అయోమయంలోను ముంచి పెంచుతున్నారు మగపిల్లలందరినిన్నీ నీవు చెప్పినమాటగూడా నమ్మకపోవటమే శారదా. యింతవరకూ వాటికి తగిన శ్రద్ధచూపించకపోవటానికి కారణం ? అదే యింతవరకు తెచ్చింది."

నా గొంతు ఉద్వేగంతో వణుకుతున్న పెదిమల స్వరంతో అన్నది మెల్లిగా "యిప్పుడెల్లా తెలిసికున్నారు ఎట్లా తెలిసి...."

"నువ్వు వెళ్ళిన పదిరోజులకల్లా డాక్టరు శంకరంగారి ఇంటికి వెళ్ళాను. కలిసే ఆడుకున్నాం ఆరోజుసాయంత్రం. నాలో చెలరేగిన ఆగ్రహం నాకళ్ళల్లో తీవ్రంగా ప్రతిబింబిస్తోంది. "ఏమిటిరా దయ్యంలాగా అలాతయారయావు?" అన్నారాయన. నేను జరిగినదంతా చెప్పేశాను. నావంక తేరిపార జూస్తున్నాడు ఒక చేతివేళ్ళతో రేగిన జుట్టును సవిరించుకుంటూ. ఆయన చెప్పాడు నాకీపారమంతా. ఆతను చెప్పింది అక్షరాలా నిజం. శారదా. నువ్వుచెప్పిందీ అంతే." అతని నుదురు ముడుతలు పడింది "శంకరం అన్నాడు. పురుషుడి అజ్ఞానమే సాధారణంగా కుటుంబ కలహాలకీ.... కలహాలు ముదిరి అసలు చెడిపోవటానికి కారణాలు" అని.

వక్కసారిగా చంద్రం నావైపు చేతులుచాచి నా రెండు చేతులూ పట్టుకున్నాడు. "మనం విడిపోవటానికి వీల్లేదు శారదా" "అంతేగాదు మీరు గ్రహించాల్సింది యింకా వుంది" నా మాటలు తడబడుతూ వస్తున్నాయి. ఎక్కడో వకమనిషి పెళ్ళాం అనిపించుకోటం కాదు నాక్కావలసింది నా వ్యక్తిత్వానికి తగినస్థానం వుండాలి" అనేశాను ఆవేశంలో.

"నాకు తెలుసు. తెలుసునాకు" అతని చేతులు గట్టిగా బిగుసుకుంటున్నాయి "కాని నాకు సరైన మాట దొరకటంలేదు "శారదా. నా వుద్దేశమూ అంతే. నువ్వుదాన్ని గురించి యింకేమీ చెప్పనక్ఖర్లేదు. శారదా నన్ను ప్రేమించవూ ? నన్ను అర్థంచేసికోవటానికి ప్రయత్నమయినా చెయ్యవూ ?"

నేను లేచి నిలబడ్డాను శరీరమంతా గజగజా వణికిపోతోంది. నేను అతన్ని యింకా ప్రేమిస్తూనేవున్నాను. నాలో అనంతమైన ప్రేమ యిమిడివుంది. కాని నా భవిష్యత్ జీవితాన్ని నమ్మగలనా ? యీ మార్పు స్థిరంగా వుండేదేనా ? కాకపోయినా మిగిలినదానిని నిర్వహించుకోగలననే ధైర్యం కలిగింది.

నా ఆలోచనలను నా ముఖంలోనే పసిగట్టారు. "శారదా యివిగో చూడూ. యివన్నీ నీకోసం తెచ్చాను. అదేమంత గొప్పవనని నేను చెప్పటంలేదు. నీకెన్ని కావాలంటే అన్నీ తెప్పించుకో. యికముందునుంచి పైకం గురించి నన్ను మాటి మాటికీ అడగవలసిన అవసరం రాకుండా చూడగలబాధ్యత నాది."

వక్కసారిగా కన్నీళ్లు నా చెక్కిళ్ళ వెంబడి స్రవించటం ప్రారంభించాయి. తప్పుచేసిన పిల్లాడు మంచిగా వుండటానికి చేసే ప్రయత్నంలాగా వున్నాయి యిప్పుడు వారుచేసే పనులన్నీ. కిటికీనిండా రకరకాల పూలకుండ్లు బారులుతీర్చి వున్నాయి.

అతను హృదయానికి గట్టిగా చేరదీసుకుని "నా శా-ర-ద" అన్నారు వణుకుతున్న స్వరంతో. నేనేదో మాట్లాడబోయాను గాని కంఠస్వరం స్థంభించిపోయింది.

పోట్లాటలూ పట్టింపులూ వస్తూనే వుంటాయి. అప్పుడయినా అవి అంత తేలిగ్గా సర్దుకుంటాయని నాకు నమ్మకంలేదు. వివాహమంటే జీవితానికి సంబంధించినది. అతను నా భర్త. నేనతని భార్యను. పరస్పరం ప్రేమించుకుంటూ జరిగిన తప్పులు మళ్ళీ జరుగకుండా చూసుకోవటమే చేయగలిగిన పని.

వారు నాకళ్ళల్లోకి సూటిగా చూస్తున్నారు.

"నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. ఈ జ్ఞానం గడ్డుదారిని గ్రహించినా గ్రహించి అర్థం చేసుకున్నమాట నిజం శారదా" అన్నారాయన.

"నేనూ నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను" అతని కౌగిలిలోనుంచి మెల్లిగా అన్నాను.

ఇద్దరమూ శాయశక్తులా ప్రయత్నంచేస్తే చేయలేనిదేమీ లేదని నా దృఢ విశ్వాసం.